

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0



నవాబ్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం



మూసాపేటలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



మూసాపేటలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేస్తున్న భట్టి, ఎమ్మెల్యే జీఎంఆర్



మూసాపేట సభకు హాజరైన ప్రజలు

పదేళ్లలో ఒక్క ఎకరాకూ నీరివ్వలే

- బీఆర్ఎస్ హయాంలో నిధులు ఆవిరైనా.. నీళ్లు మాత్రం రాలేదు
- పాలమూరు-రంగారెడ్డి ద్వారా కూడా నీళ్లు పారించేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.70 కోట్లు కేటాయించాం..
- శంకరసముద్రానికి రూ.32 కోట్లు ఇస్తాం
- త్వరలోనే చౌదర్‌పల్లి లిఫ్ట్‌కు అనుమతులు: ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క
- దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లో పర్యటన

మహబూబ్‌నగర్/మూసాపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'పాలమూరు పక్కనే కృష్ణానది పారుతుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకుంటే నీరు తమ పొలాలకు పారించుకోవచ్చని సాధించుకుంటే, పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేకపోయింద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి 12 సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు మూసాపేట మండలంలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలిసి భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పాలమూరు జిల్లాలో జూరాల, కోయిల్ సాగర్, భీమా, కల్వకుర్తి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డికి కూడా కాంగ్రెస్ అనుమతులిస్తే ప్రాజెక్టు చేపడతామని కేసీఆర్ 2015లో కర్వెన దగ్గర శంకుస్థాపన చేశారన్నారు. మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటికీ పూర్తిచేయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా నీళ్లు పారించేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని హామీ ఇస్తున్నానని భట్టి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు హడావుడిగా నార్లాపూర్ వద్ద ఒక పంప్‌ను ప్రారంభించి, అద్భుతమని అభూతకల్పన చేశారన్నారు. అది ట్రయల్ రన్‌కే పరిమితమైందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిధులు ఆవిరయ్యాయే తప్ప నీళ్లు మాత్రం పారలేదని ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా నార్లాపూర్-ఏదుల మధ్య ఉన్న గ్యాప్‌ను పూర్తి చేయడానికి ప్రాధాన్యంగా తీసుకుని నిధులు కేటాయించామన్నారు. పనులు కూడా ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.70 కోట్లు అవసరం ఉన్నాయని వాటికీ నిధులు కేటాయించామన్నారు. భవిష్యత్తులో అవసరం ఉంటే మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. శంకర సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ఆర్అండ్ఆర్ నిధులు రూ.33 కోట్లు పెండింగ్ ఉన్నాయని వాటిని కూడా విడుదల చేస్తామన్నారు. చౌదర్‌పల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు త్వరలోనే ఆర్థిక అనుమతులు ఇస్తామన్నారు. ఈ లిఫ్ట్ చేపడితే 20 వేల ఎకరాలకు నీరు పారుతుందని చెప్పారు. పాలమూరు జిల్లాకు సంబంధించి విద్యుత్, నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. 2035 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 33,775 మెగావాట్లుగా అంచనా వేశామని, అందుకు తగిన విధంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు అవసరమైన ప్రణాళికలను ఇప్పుడే సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్‌ను కుట్రదారులు ఆపలేరని స్పష్టం చేశారు. జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారని, వెనుకబడిన పాలమూరుకు నిధుల కేటాయింపులో

(మిగతా 6లో..)



పేటలో ఓ రేషన్ దుకాణం దగ్గర ఏడాది క్రితమే ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలు

ఫ్లెక్సీల పంచాయితీ

- 'పేట'లో మూడు రేషన్ దుకాణాల వద్ద బీజేపీ ఫ్లెక్సీలు
- అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు
- సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదుతో తొలగింపు

6

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భూ భారతితో సమస్యలు పరిష్కారం అవుతాయని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దదగడలో భూభారతి పోర్టల్‌పై సమావేశం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు సమస్యలు పరిష్కారం కాకపోగా... ఎన్నడూ లేని విధంగా సమస్యలు ఎక్కువయ్యాయన్నారు. పరిష్కార మార్గాలు కనిపించక, ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా చెప్పులు అరిగేవి. కానీ నేటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ధరణిలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణారావు, చంద్రశేఖర్ యాదవ్, కొత్త కళ్యాణ్ కుమార్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈద్-ఉల్-జుహా

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

- ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాలు, మసీదులు ముస్తాబు
- జోరుగా పొట్టేళ్ల విక్రయాలు



విద్యుత్ కాంతుల్లో ధగధగలాడుతున్న మహబూబ్‌నగర్‌లోని మదీన మసీదు

మహబూబ్‌నగర్ అర్బన్/నారాయణపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో శనివారం బక్రీద్ పండుగను జరుపుకునేందుకు ముస్లింలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సామూహిక ప్రార్థనల కోసం ఈద్గాలను సిద్ధం చేశారు. ఖుర్బానీ ఇవ్వడం కోసం చాలా మంది గురు, శుక్రవారాల్లో జీవాలను కొనుగోలు చేశారు.

ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వానగుట్ట వద్ద గల రహెమానియా ఈద్గా వద్ద ఈద్ నమాజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9:00 గంటలకు హాఫిజ్ ఇస్మాయిల్ ఖాద్రీ ఆధ్వర్యంలో నమాజ్ చేయనున్నారు. జడ్చర్ల ఈద్గాలో ఉదయం 8:45 గంటలకు, దేవరకద్ర ఈద్గాలో 8:30 గంటలకు నమాజ్ చేయనున్నారు. జిల్లా కేంద్రంలోని మక్కామసీదు, మదీన, రైల్వే స్టేషన్, ఓమర్ సిరాజుల్ ఉలుమ్ మదర్సా, షాషాబ్ గుట్ట, సూఫిమా, రియాజుల్‌జన్నా, మునీర్, అల్‌కౌసర్ మసీదులతో పాటు మండలాలు, గ్రామాల్లో కూడా ఆయా మసీదులు, ఈద్గాల వద్ద నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు.

మూడు రోజులు మాంసం పంపిణీ

బక్రీద్ పండుగ సందర్భంగా దాన ధర్మాలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు. మూడు రోజుల పాటు పొట్టేలు మాంసాన్ని పంపిణీ చేస్తారు. దాంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్, పలు ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలు వెలిశాయి. పొట్టేళ్ల బరువును బట్టి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ధరలు ఉన్నాయి.

కర్ణాటక నుంచి కొనుగోలు

కర్ణాటక రాష్ట్రం అమీన్‌ఘడ్, యాదగిరి, సైదాపూర్, షాపూర్, గుర్మిట్కల్ తదితర ప్రాంతాల నుంచి నారాయణపేట జిల్లాలోని ముస్లింలు పొట్టేళ్లను కొనుగోలు చేశారు. రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు ధరలు పెట్టి వాటిని కొన్నారు. నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్ పరిసర ప్రాంతాలలో రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు పొట్టేళ్ల ధరలు పలికాయి.

నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట జిల్లాలోని 65 మసీదులు, ఈద్గాలు ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబయ్యాయి. పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, అత్యవసర సమయాల్లో పోలీస్ కంట్రోల్ రూమ్ 8712 670399 లేదా 100కు ఫోన్ చేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ చెప్పారు. నారాయణపేట ఈద్గా వద్ద మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టి, ఏర్పాట్లు చేసేలా చూశారు.



మహబూబ్‌నగర్‌లో పొట్టేళ్లను కొంటున్న ముస్లింలు

లోపలి పేజీల్లో..



పిచ్చికుక్కల స్వైర విహారం
- ఏడుగురికి తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఘటనలు
7

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన ఎల్లూరు విద్యార్థి
- సన్మానించిన మంత్రి పొన్నం
6



ఎవరెస్టు శిఖరంపై జాతీయ జెండాతో బండారి శ్రీకాంత్

వికసిత్ భారతే లక్ష్యం
- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మనోహర్‌రెడ్డి
6

నీటి ప్రాజెక్టుల భూసేకరణపై ప్రత్యేక దృష్టి

- అధికారులతో నాగర్‌కర్నూల్ కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొనసాగుతున్న మహాత్మాగాంధీ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు రంగారెడ్డి, మార్కండేయ ఇరిగేషన్, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రాజెక్టుల భూసేకరణపై అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గత నెల 30న సమీక్షలో ప్రాజెక్టుల వారీగా నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పురోగతి సాధించిన భూసేకరణ పనులపై కూడా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై ఆయా స్థాయిలో ఉన్న చర్యలను తక్షణమే పూర్తి చేసి భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రాజెక్టుల వారీగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్లా వారీగా రెవెన్యూ, సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి సర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని సర్వేయర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ప్రాజెక్టులకు సేకరించిన భూమికి రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ నెల చివరి నాటికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు శ్రీధర్, పార్థసారథి, మురళి, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి నాగేందర్, ఆర్డీవోలు శ్రీను, మాధవి, సురేష్, భూసేకరణ విభాగం కలెక్టరేట్ సూపరింటెండెంట్ నారాయణ, కార్తీక్ రావు, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల బలోపేతానికి కృషి



ఎర్రవల్లిలో భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి
- ఎర్రవల్లిలో నూతన బ్యాంకు నిర్మాణానికి భూమిపూజ

ఎర్రవల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు వ్యవస్థను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని డీసీసీబీ ఉమ్మడి జిల్లా చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎర్రవల్లిలో శుక్రవారం సహకార బ్యాంకు నూతన భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. రూ.37లక్షల వ్యయంతో నిర్మించనున్నామని, మూడు నెలల్లో పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులో తెస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పుటాన్‌దొడ్డి, గార్లపాడు అధ్యక్షుడు రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌లు, సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ రాధా, ఫీల్డ్ ఆఫీసర్ పుల్లారెడ్డి, సిబ్బంది శ్రీధర్ రెడ్డి ఇంజనీర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

లాభాలు పొందాలని అల్ప్రాజోలం విక్రయం

- వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర రావు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర రావు

పెబ్బేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : లాభాలు ఆర్జించాలని అల్ప్రాజోలం విక్రయాలు చేస్తున్నారని, నిషేధిత మత్తు పదార్థాలు క్రయ, విక్రయాలు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర రావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం, బింగిదొడ్డికి చెందిన ఈడిగ నరసింహ గౌడ్ కల్లు వ్యాపారంలో నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కర్నూల్ జిల్లాలో తమ బంధువుల శుభకార్యంలో హర్షవర్ధన్ గౌడ్, జగదీష్ గౌడ్, గోపాల్ గౌడులతో కల్లు వ్యాపారంలో నష్టాల గురించి వారితో చెప్పుకున్నాడు. రూ.2.80 లక్షలతో కిలో ఆల్ప్రాజోలాన్ని కొనుగోలు చేసి రూ.4 లక్షల వరకు లాభంతో విక్రయించవచ్చని పరిచయమైన ముగ్గురు వ్యక్తులు చెప్పారు. దీంతో నరసింహ గౌడ్ గట్టు మండలంలోని తుమ్మలపల్లికి చెందిన ఈడిగి భాస్కర్ గౌడ్‌తో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ఇద్దరు వ్యక్తులు కల్లు దుకాణాలు నడుపుతున్న అనంతపురం జిల్లాకు చెందిన ఈడిగి లక్ష్మన్న గౌడ్, పండ్ల రమేష్, ఈడిగి గజేంద్ర గౌడ్, నాగర్‌కర్నూల్‌కు చెందిన యుగేంధర్ గౌడులకు ఆల్ప్రాజోలం విక్రయించి సొమ్ము చేసుకునేవారు. నమ్మదగ్గ సమాచారంతో ఎస్ఐ యుగేందర్ రెడ్డి గురువారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా... కల్తీ కల్లు తయారు చేసేందుకు ఉపయోగించే 500 గ్రాముల అల్ప్రాజోలం మత్తు పదార్థం లభించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ యుగేందర్ రెడ్డి, సిబ్బందిని అభినందించారు.

పదేళ్లలో ఒక్క ఎకరాకూ నీరివ్వలే

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి కేబినెట్‌లో కోరారని, కేబినెట్ కూడా మహబూబ్‌నగర్‌కు ప్రాధాన్యత ఇచ్చేవిషయంలో సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇవ్వకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు. మరో 30 వేల ఉద్యోగాల నియామకాల ప్రక్రియ ప్రాసెస్‌లో ఉందన్నారు. రాజీవ్ యువవికాసం పేరుతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రూ.8 వేల కోట్లు కేటాయించామన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం కొనసాగేందుకు ప్రజల ఆశీర్వాదం, అండదండలు ఉండాలన్నారు. ప్రజల కోసం మరిన్ని పథకాలు తెచ్చేందుకు మీ ప్రేమ కావాలని కోరారు.



నవాబ్‌పేటలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు రూ.లక్ష చెక్కును అందిస్తున్న భట్టి విక్రమార్క

రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారు: మంత్రి జూపల్లి కృష్ణారావు

బీఆర్‌ఎస్ పదేళ్ల నియంత పాలనలో కేసీఆర్ కుటుంబ సభ్యులు ఇష్టానుసారంగా దోచుకుని, రాష్ట్రం దివాలా తీసేలా చేశారని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ సంక్షేమ పథకాలను రద్దు చేయలేదని, ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ, సన్న బియ్యం సరఫరా, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాలు కూడా అమలు చేస్తున్నామన్నారు. గత పాలకులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ రాదని తప్పుడు ప్రచారం చేశారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 17 మాసాల్లో నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని నియోజకవర్గాల్లో నూతన సబ్‌స్టేషన్‌లను నిర్మించుకుంటున్నట్లు చెప్పారు. మొదటి సంవత్సరం దేవరకద్ర నియోజకవర్గంలో రూ.70 కోట్లతో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు.



నవాబ్‌పేటలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కరెంట్ లేక పంటలు ఎండిపోయాయని తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గం వ్యవసాయంపై ఆధారపడి ఉందని, రైతుల కరెంట్ కష్టాలు తీర్చాలని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయాలని కోరగా, 13 33 కేవీ సబ్ స్టేషన్‌లు, 132 కేవీ సబ్‌స్టేషన్‌లు మంజూరు చేశారన్నారు. రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. మన్నెంకొండ దగ్గర చౌదర్‌పల్లి లిఫ్టునకు అనుమతి ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి వేముల, మదిగట్లతో పాటు ఇతర చెరువుల్లో నల్లమట్టిని దోచుకుని కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మైనారిటీలకు కుట్టు మిషన్లు అందించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్‌లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, నాగిరెడ్డి, నాగార్జున్‌రెడ్డి, ప్రశాంత్, బగ్గికృష్ణయ్య, కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, బాలనర్సింహులు, జగదీశ్వర్, తిరుపతయ్యగౌడ్, రత్నయ్యయాదవ్, తాజొద్దీన్, ఖలీల్ పాల్గొన్నారు.

సోషల్‌మీడియాతో కుట్ర

కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడించేందుకు సోషల్‌మీడియాతో కుట్ర పన్నుతున్నారంటూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కేంద్రంలో శుక్రవారం 17 విద్యుత్ సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గానికి ఉత్పత్తి పెంచి, డిమాండ్ పెరిగేలా 33 కెవి సబ్‌స్టేషన్‌లు 16తో పాటు ఒక 132 సబ్‌స్టేషన్‌ను పట్టుబట్టి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంజూరు చేయించుకున్నాడని ప్రశంసించారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు అండగా ఉండాలి

: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఉదండాపూర్ నిర్వాసితులకు అండగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా ఉదండాపూర్ ప్రాజెక్టును మల్లు భట్టి విక్రమార్క సందర్శించారన్నారు. నిర్వాసితుల సమస్యలను తెలుసుకున్ననాడే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యలను పరిష్కరిస్తామని మాట ఇచ్చారని, ఇచ్చిన మాట మేరకు నిర్వాసితుల పునరావాసం కోసం రూ.70 కోట్లను మంజూరు చేశారని గుర్తుచేసారు. జడ్చర్ల నియోజకవర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద లైన్ సమస్యలు, ఫెన్సింగ్ తదితర అంశాలకు రూ.11కోట్లను మంజూరీ చేయాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి 10 సంవత్సరాల బాలుడు మృతిచెందిన సంఘటన జడ్చర్ల పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిందంటూ భట్టికి వివరించారు. నియోజకవర్గంలోని తండాలకు లింకురోడ్లకు రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఓ పార్టీలో దెయ్యాలున్నాయని ఆ పార్టీకి చెందిన నాయకులే అంటున్నారని, అలాంటి దెయ్యాలను గ్రామాలకు రానివ్వకుండా ఉండాలని పిలుపునిచ్చారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ ఆంజనేయస్వామి గుడి, ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేవన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ స్వయం సహయక సంఘాలకు వడ్డీలేని రుణాలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తుందన్నారు.

జూరాలకు తగ్గిన వరద

» శ్రీశైలం ప్రాజెక్టులో నిలకడగా నీటిమట్టం

ధరూరు/దోమలపెంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పడుతుండటంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి అధికారులు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. శుక్రవారం ఎగువన ఉన్న ఆల్మటి జలాశయంలో 58 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఆ దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలో 28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రస్తుతం జూరాల జలాశయంలో 317.850 మీటర్లలో 4.612 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. జూరాలకు 7,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిన అధికారులు నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650, మొత్తం జూరాల ప్రాజెక్టు నుంచి 2,532 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సుంకేసుల, జూరాల ప్రాజెక్టుల నుంచి వరద నీరు రావడం లేదు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 835.50 అడుగులలో 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 54.6692 టీఎంసీల నీరు ఉన్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో 3,586 క్యూసెక్కుల నీటిని వినియోగించి 1.739 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 7,075 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 3.181 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగించారు. మొత్తంగా ప్రాజెక్టు నుంచి 10,912 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన ఎల్లూరు విద్యార్థి బండారి శ్రీకాంత్

» సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్



ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థి బండారి శ్రీకాంత్‌ను సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కొల్లాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామానికి చెందిన విద్యార్థి బండారి శ్రీకాంత్ చిన్న వయస్సులోనే అధిరోహించాడు. కుర్వ బిచ్చన్న, మల్లమ్మ దంపతుల రెండవ కుమారుడు బండారి శ్రీకాంత్ 5వ తరగతి వరకు కొల్లాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్య నభ్యసించాడు. ఐదవ తరగతిలో గురుకుల పాఠశాల ఎంట్రన్స్ పరీక్ష రాయి రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి విద్యాభ్యాసం ప్రారంభించాడు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బండారి శ్రీకాంత్ గురుకుల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు పది మంది విద్యార్థులు ఒక బృందంగా కలిసి గత నెల 25వ తేదీన ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కేందుకు వెళ్లారు. ఈనెల 5వ తేదీన ఉదయం ఎవరెస్టు శిఖరానికి చేరుకున్నారు. అందులో బండారి శ్రీకాంత్ జాతీయ జెండాతో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడంతో ఎల్లూరు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బండారి శ్రీకాంత్‌ను శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శాలువా పూలమాలతో సత్కరించారు.

విజ్ఞాన విహార యాత్రలకు బస్సులు

» ఆర్టీసీ రీజనల్ మనేజర్ సంతోష్‌కుమార్



విజ్ఞాన యాత్రల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్.యం సంతోష్‌కుమార్‌తో పాటు అధికారులు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పది ఆర్టీసీ డిపోల నుంచి విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు సిద్ధంగా ఉన్నాయని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ తలిపారు. స్థానిక రీజనల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా విజ్ఞాన విహార యాత్రలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచి రూట్ నెంబర్-1లో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం వెళ్లేందుకు 3 రోజుల ప్యాకేజీకి ఒక్కొక్కరికి రూ. 3,600 ఉంటుందని తెలిపారు. రూట్ నెంబర్ - 2లో గానుగాపూర్, తుల్జాపూర్, పండరీపూర్ వెళ్లేందుకు 2 రోజుల ప్యాకేజీ ఒక్కొక్కరికి రూ. 2,450 ఉంటుందని చెప్పారు. రూట్ నెంబర్ - 3లో మహానంది, యాగంటి, బ్రహ్మంగారి మఠం, మంత్రాలయం యాత్రకు 2 రోజుల ప్యాకేజీ రూ. 2100గా నిర్ణయించినట్లు చెప్పారు. రూట్ నెంబర్-4లో తుల్జాపూర్, శనిసింగాపూర్, షిర్డీ యాత్రకు 3 రోజుల ప్యాకేజీ రూ.3,600, రూట్ నెంబర్ -5లో యాదగిరి గుట్ట, స్వర్ణగిరి, నాగిరెడ్డిపల్లి స్వర్ణశివాలయం యాత్రకు ఒక రోజు ప్యాకేజీ 1,050 ఉంటుందని తెలిపారు. రూట్ నెంబర్ -6 అలంపూర్, బీచ్‌పల్లి, శ్రీరంగాపూర్, జటప్రోల్, సోమశిల, సింగోటం ఒక రోజు ప్యాకేజీ రూ. 950, రూట్ నెంబర్ -7లో విశాఖపట్నం, అరకు, బుర్రాగుహలు, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ యాత్రకు 5 రోజుల ప్యాకేగా ఒక్కొక్కరికి 4,400గా నిర్ణయంచినట్టు తెలిపారు. మిగతా 9 డిపోల నుంచి కూడా ప్రత్యేక ప్యాకేజీల ద్వారా చార్జీలు నిర్ణయించినట్లు చెప్పారు. బస్సు బుక్ చేసుకున్న వారికి ఒక సీటు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

సమావేశంలో డిప్యూటీ ఆర్‌ఎం లక్ష్మీధర్మ, ఏవో గంగాధర్, పీవో వి.సుజాత, మహబూబ్‌నగర్ డీఎం బి.సుజాత పాల్గొన్నారు.

వికసిత్ భారతే లక్ష్యం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ లక్ష్యంతోనే ప్రధాని మోదీ ముందుకెళ్తున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.మనోహర్‌రెడ్డి అన్నారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనను పురస్కరించుకొని శక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్న మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో 4వ స్థానంలో భారత్ అవతరించిందని వివరించారు. సమర్థవంతమైన నాయకత్వంతో, సామాజిక అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా మోదీ పాలన కొనసాగుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ ఒక చరిత్మాకమైన విజయం సాధించిన నేపథ్యంలో శక్తివంతంమైన భారతదేశాన్ని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారని అన్నారు. ఉగ్రవాదంపై పోరుకు ఆపరేషన్ సిందూర్ ప్రపంచ వ్యాప్తంగా ఒక కొత్త ఒరవడిని సృష్టించిందన్న ప్రధాని మాటలను ఆయన గుర్తుచేశారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని, పర్యావరణాన్ని కాపాడుకోడానికి అమ్మ కోసం ఒక మొక్క నినాదంతో ప్రతీ ఒక్కరు మొక్క నాటాలని మోదీ ఇచ్చిన పిలుపును గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మ జారెడ్డి, పడాకుల బాలరాజు, నాయకులు పాండురంగారెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, పడాకుల సత్యం, అచ్చిగట్ల అంజయ్య, రమేశ్ కుమార్, బొంగు గంగన్న పాల్గొన్నారు.

రాజ్యాంగంపై ప్రమాణం చేసి వధువుకు తాళికట్టిన వరుడు



రాజ్యాంగంపై ప్రమాణం చేసి వివాహం చేసుకున్న నూతన వధూవరులు రఘురాములు, లావణ్య

కందనూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి వివాహ వేదికపై అంబేడ్కర్, గౌతమబుద్ధుని ఫోటోల సమక్షంలో వరుడు వధువుకు తాళి కట్టిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన కసునూరు రఘురాములు తిమ్మాజీపేట మండలంలోని బాజీపూర్ గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది. ఇట్టి వివాహ వేదికపై రెండు కుర్చీలు వేసి ఒక కుర్చీలో గౌతమబుద్ధుని ఫోటో, మరో కుర్చీలో అంబేడ్కర్ దంపతుల ఫోటోలకు పూలదండ వేసి వివాహ వేడుకలు నిర్వహించుకున్నారు. వివాహానికి వచ్చిన వారంతా ఫోటోలకు దండం పెట్టి వధూవరులను ఆశీర్వదించారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి తాళికట్టి అందరికీ ఆదర్శంగా వధూవరులు నిలిచారు. ఇలాంటి వివాహం ఈ ప్రాంతంలో మొదటిసారిగా జరగడంతో చర్చనీయాంశంగా మారింది.

గంజాయితో జీవితాలు నాశనం

» ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగి యువకులు జీవితాలను నాశనం చేసుకోవద్దని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. శుక్రవారం ఎస్పీ ఆఫీస్‌లో లింగాల మండలం అప్పయ్యపల్లి గ్రామ వాసి వేముల శివరాంసాగర్, ప్రొడ్యూసర్ మహేష్ రాసిన గంజాయి, మాదకద్రవ్యాల వీడియో సాంగ్‌ను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మీద ఎలాంటి సమాచారం తెలిపిన జిల్లా పోలీసులకు, మీ యొక్క పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, కొల్లాపూర్ సీఐ మహేష్, సీసీఎస్ సీఐ శంకర్, నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్, దాదాపు 30 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి మాదక ద్రవ్యాల సాంగ్‌ను రిలీజ్ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఫ్లెక్సీల పంచాయితీ

» 'పేట'లో మూడు రేషన్ దుకాణాల వద్ద బీజేపీ ఫ్లెక్సీలు

» అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు

» సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదుతో తొలగింపు



పేటలో ఓ రేషన్ దుకాణం దగ్గర ఏర్పాటు చేసిన బీజేపీ నాయకుల ఫ్లెక్సీ

నారాయణపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో రేషన్ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారి తీశాయి. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో మూడు నెలల బియ్యాన్ని ఒకే సారి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. అయితే త్వరలో మునిసిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వార్తలు వస్తుండటంతో బియ్యం పంపిణీని ఆయా పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు యత్నిస్తున్నాయి. ఈ క్రమంలో పట్టణంలోని మూడు రేషన్ దుకాణాల వద్ద బీజేపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై అధికారుల కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి అధికారులు రంగంలోకి దిగారు. రేషన్ దుకాణాలకు కాస్తా దూరంలో ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీలతో ఇబ్బంది లేదని భావించారు. మూడు దుకాణాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించారు. ఇలాంటి విషయాల్లో రాజకీయాలకు తావివ్వొద్దని స్థానిక ఎమ్మెల్యే సివిల్ సప్లై అధికారులకు సూచించినట్లు సమాచారం. ఈ విషయంపై సివిల్ సప్లై జిల్లా అధికారి బాల్‌రాజ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రేషన్ దుకాణాలకు దగ్గరగా ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీలను తొలగించినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరిగితే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఏడాది క్రితమే ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రాలతో రూపొందించిన ఫ్లెక్సీలను దుకాణాల వద్ద ఏర్పాటు చేశారు. అవి పాతవై చిరిగి పోవడంతో పట్టణంలోని వేదవతి, గఫూర్, అశోక్ రేషన్ దుకాణాల వద్ద బీజేపీ నాయకులు కొత్త ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అవే ఇప్పుడు వివాదానికి దారితీశాయి.

జాతీయ పక్షిని కాపాడిన యువకుడు



పోలీస్ స్టేషన్‌లో జాతీయ పక్షిని అప్పగిస్తున్న దృశ్యం

నర్వ, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడి నుంచి జాతీయ పక్షిని కాపాడిన యువకుడు దానిని పోలీసులకు అప్పగించారు. నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఓ నెమలిని కుక్కలు వెంబడించడంతో అది గ్రామ శివారులోని పొలం వద్ద ఉన్న బాలస్వామి ఇంటివైపు వచ్చింది. ఇంటి ఆవరణలో ఉన్న బాలస్వామి గమనించి, కుక్కలను తరిమేసి నెమలిని కాపాడాడు. అనంతరం దానిని నర్వ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా, ఎస్‌ఐ కుర్మయ్య అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫారెస్టు అధికారి మల్లేశ్‌కు దానిని అప్పగించారు. బాలస్వామిని ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు అభినందించారు.

తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన



తడి పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేస్తున్న మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్‌షేక్‌లు

కల్వకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మునిసిపల్ పరిధిలోని ప్రజలు తడి పొడి చెత్తను వేరు చేసి మునిసిపల్ వాహనానికి అందజేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్‌లు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో జరుగుతున్న కార్యక్రమాలను వారు పరిశీలించి తడి పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించి పాంప్లెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో తిరుగుతూ పట్టణ ప్రజలకు తడి పొడి చెత్తను వేరు చేసి ప్రతి రోజు ఇంటింటికి వచ్చే పురపాలక సంఘం ఆటోకు అందజేయాలన్నారు. అదేవిధంగా పురపాలక సంఘ డీఆర్‌సీసీ సెంటర్‌ను, పార్కులను, కుర్మిద్ద రోడ్డులో నిర్మాణం జరుగుతున్న అనిమల్ బర్త్‌కేర్ సెంటర్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘలా వారు పుర సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం



మల్దకల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్

మల్దకల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ గ్రామ పరిధిలో అధిక లోడుతో వెళుతున్న ఇసుక టిప్పర్‌ను శుక్రవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్దకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయిజ - గద్వాల మెయిన్ రోడ్డులో తనిఖీలు నిర్వస్తుండగా, అధిక లోడుతో వెళుతున్న ఇసుక టిప్పర్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. పట్టుబడిన ఇసుక టిప్పర్‌ను మల్దకల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్రైం కార్నర్

పిచ్చికుక్కల స్వైర విహారం

» ఏడుగురికి తీవ్ర గాయాలు » ముగ్గురి పరిస్థితి విషమం

» గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఘటనలు

ఎర్రవల్లి/ వెల్దండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. ఏడుగురిని గాయపరచగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామంలో ఆరుగురిని పిచ్చికుక్క కరిచింది. దీంతో గోపాల్, వెంకటేశ్, మాసుంబీ, చాకలిగోపి, చాకలిమద్దమ్మ, వేణుగోపాల్‌కు గాయాలయ్యాయి. వారిలో చాకలి గోపి, గోపాల్‌లకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత గ్రామస్థులు పిచ్చికుక్కను చంపారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రంలో గురువారం రాత్రి ఆంద్రయ్య అనే వ్యక్తిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. వీరనాగమ్మ పండుగకు వెళ్లి వస్తున్న ఆయనపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని కల్వకుర్తి ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి

పెద్దకొత్తపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ గ్రామంలో ఓ మహిళ శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బద్దుల సాలమ్మ (45) గురువారం రాత్రి ఇంటి బయట పడుకొని నిద్రపోయింది. రాత్రి 2 గంటల సమయంలో ఆమెను పాము కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు ఆమెను స్థానిక మంత్రగాడి వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ఇంటికి వచ్చి నిద్రపోయిన ఆమె శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమెకు భర్త చిన్నయ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వి.సతీశ్ తెలిపారు.

పశువుల అక్రమ రవాణా

» పట్టుకున్న గ్రామస్థులు

దేవరకద్ర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పశువులను అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలంలోని చౌదరపల్లి గ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు గురువారం రాత్రి డీసీఎం వాహనంలో పశువులను తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. వాహనంలోని 17 కోడే దూడలు, ఒక ఆవును పోలీసులకు అప్పగించారు. వాటిని చిన్నదర్‌పల్లి గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఇద్దరు నిందితులు హసన్, మహమ్మద్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అఖిలపక్ష నాయకుల అరెస్టు

» అయిజ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



అయిజ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్ట్ అయిన అఖిల పక్ష నాయకులు

గద్వాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న అఖిలపక్ష నాయకులను శుక్రవారం పెద్ద ధన్వాడ సమీపంలో పోలీసులు అరెస్టు చేసి, అయిజ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు రోజుల క్రితం ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం పనులు చేయడానికి సిద్ధం కాగా, రైతులు అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. ఆగ్రహించిన రైతులు, గ్రామస్థులు కంపెనీకి చెందిన తాత్కాలిక షెడ్లు, కంటైనర్లకు నిప్పంటించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు 42 మందిపై కేసులు నమోదు చేసి, 12మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాధిత గ్రామాల ప్రజలను పరామర్శించడానికి గద్వాల నుంచి అఖిల పక్ష నాయకులు వెళ్తుండగా పెద్ద ధన్వాడ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకటస్వామి, ఆంజనేయులు మాట్లాడుతూ, రైతులపై కంపెనీ యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులతో ఎదురుదాడి చేసి కొందరిని గాయపరిచిందని తెలిపారు. అయినా కంపెనీ యజమాన్యంపై పోలీసులు ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఇథనాల్ పరిశ్రమ అనుమతులను రద్దు చేయాలని, అందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని కోరారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి, వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ కుర్వ పల్లయ్య, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, బహుజన రాజ్య సమితి నాయకులు వాల్మీకి, వినోద్, ఉప్పేర్ నర్సింహ, దానయ్య, సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించుకున్న నిరంజన్‌రెడ్డి



స్వామి వారి సన్నిధిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని రాజపేటలో శుక్రవారం రాజేశ్వరీ సహిత రాజేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా జ్ఞాన సరస్వతి అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆలయ మర్యాదల తో సాధారంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి అత్యంత వైభవంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యుల ను సన్మానించి అభినందించారు. మాణిక్యం, మాదవ్‌రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము తదితరులు ఉన్నారు.

వీరనాగమ్మకు ప్రత్యేక పూజలు

» హాజరైన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

వెల్దండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రంలో గౌడకులస్తుల ఆరాధ్యదైవం వీరనాగమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అయన వెంట నాయకులు బాలాజీసింగ్, నాయకులు భూపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, మోతీలాల్, పర్వత్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

డెంగీ నివారణపై ఫోకస్

» కలెక్టర్ ఆదేశాలతో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం

» జోగుళాంబ గద్వాల జిల్లాలో 4 నెలలు 'ఫ్రైడే డ్రైడే'

» పరిసరాల పరిశుభ్రతే పరమౌషధం అంటూ ప్రచారం



మానవపాడు మండలం, పెద్ద పోతులపాడులో నిల్వ నీటిని పారబోస్తున్న పంచాయితీ సిబ్బంది



అలంపూర్ మండలం, సుల్తానాపురం గ్రామంలో నిల్వ నీటి వల్ల దోమలు వృద్ధి చెందే విషయంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



రాజోలి మండలం, వసనూరు గ్రామంలో హౌజ్‌లోని నిల్వ నీటిని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి

అయిజ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్ మొదలైంది. దాంతో పాటే వివిధ వ్యాధులకు కారణమయ్యే దోమల బెడద కూడా ఎక్కువవడం సర్వసాధారణం. ప్రధానంగా డెంగీ జ్వరాలు వ్యాపించే ప్రమాద ముంది. ఈ నేపథ్యంలో దోమల నివారణకు కలెక్టర్ ఆదేశం మేరకు జిల్లా అధికార యంత్రంగం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 13 మండలాలు, నాలుగు మునిసిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలల పాటు ప్రతీ శుక్రవారం, ప్రతీ గ్రామంలో 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఈ అధికారాన్ని మొదలు పెట్టారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పంచాయతీ, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటిస్తారు. ఇళ్ల ఆవరణలోని నీటి తొట్లు, డ్రమ్ములు, హౌజులు, కుండలు, గూనలు తదితరాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వాటితో పాటు పబ్లిక్ ప్రాంతాల్లో ఉండే నీటితొట్లు, ట్యాంకులు, వాహనాల టైర్లు, కొబ్బరి చిప్పల్లో నిల్వ ఉండే నీటిని పారబోయిస్తారు. అలాగే గ్రామాల్లో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు.



ఎర్రవల్లి మండలం, పెద్ద తాండ్రపాడు గ్రామంలో టైర్లలో నిల్వ ఉన్న నీటిని శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుడు

గత ఏడాది 31 డెంగీ కేసులు

వానాకంలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. గతేడాది ఈ సీజన్‌లో జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 31 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెప్తున్నారు. దీంతో ముందస్తుగా అప్రమత్తమైన అధికారులు వ్యాధి నివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. డ్రైనేజీలు, మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో అయిల్ బాల్స్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రకాల జ్వరాలను కలిగించే దోమలు పెట్టిన గుడ్ల నుంచి లార్వాలు, అనంతరం ప్యూపా దశ నుంచి దోమగా రూపాంతరం చెందేందుకు 14 నుంచి 15 రోజులు సమయం పడుతుంది.

ఈ దశలోనే వాటిని నిర్మూలించే వీలు ఉంటుంది. అలాగే దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టొచ్చని అధికారులు చెప్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో డ్రైడే



కలెక్టర్ ఆదేశాలతో ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతీ ఇంటికి వెళ్లి నిల్వ నీటిని పారబోసేలా చర్యలు తీసుకుంటున్నాం. పబ్లిక్ ప్రాంతాల్లోనూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం. మా సిబ్బంది, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామంలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- తులసికుమార్, పంచాయితీ కార్యదర్శి, అల్వాలపాడు, ధరూరు

ఆరోగ్య గద్వాలే లక్ష్యం



జోగుళాంబ గద్వాలను ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు బాధ్యతగా పని చేస్తున్నాం. ఈ ఏడాది డెంగీ కేసులు నమోదుకు కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న జ్వరం వస్తే స్థానికంగానే పరీక్షలు చేయించుకొని డెంగీ అని భయపడుతున్నారు. కానీ జిల్లా ఆసుపత్రిలో చేసే ఎలీసా టెస్ట్ ద్వారానే డెంగీ నిర్ధారణ అవుతుంది.

- సిద్దప్ప, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, గద్వాల

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం



ప్రతీ శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని పంచాయతీ, ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. అందులో భాగంగా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయడం, వీధుల్లో ఫాగింగ్ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సీజన్ ముగిసే వరకు నాలుగు నెలల పాటు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించాం.

- నర్సింగరావు, అదనపు కలెక్టర్, గద్వాల

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

» బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్‌దొడ్డి వెంకట్రాములు

» గద్వాల పాత బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా



గద్వాల పాతబస్టాండ్ సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకులు

గద్వాల టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్‌దొడ్డి వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆపరేషన్‌కు కగార్‌ను నిరసిస్తూ వామపక్షాలు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గద్వాల పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఆంజనేయులు, వెంకటస్వామి మాట్లాడారు. విలువైన ఆటవీ సంపదను పెట్టుబడిదారులు, కార్పొరేట్లపరం చేసేందుకు కేంద్రం ప్రభుత్వ ఎత్తుగడలో భాగమే ఆపరేషన్ కగార్ అని ఆరోపించారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో అటవీ ప్రాంతంలో అనాదిగా నివసిస్తున్న ఆదివాసీలపై సాగుతున్న ఊచకోత మానవత్వాన్ని మంటగలిపేదిగా ఉందన్నారు.

వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, లేకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ సుభాన్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, సీపీఐ- ఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెస్, ఏఐటీయూసీ, ఏఐకేఎస్, సీఐటీయూ, ఏఐఎస్ఎఫ్, బీఆర్ ఎస్ సంఘాల నాయకులు గోపాల్‌రావు, జి.గోపాల్, ఆశన్న, వాల్మీకి, రంగన్న, నరసింహులు, ప్రవీణ్, ధర్మన్న, తిమ్మప్ప, చిన్న, మస్తాన్, రవి పాల్గొన్నారు.

వన్‌డే లీగ్ చాంపియన్ మహబూబ్‌నగర్

» 71 పరుగుల తేడాతో జడ్చర్లపై ఘన విజయం

» అర్ధసెంచరీతో రాణించిన కాన్షిక్



అండర్-19 చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 ఉమ్మడి జిల్లా వన్‌డే లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. పాలమూరు పట్టణ సమీపంలోని సమర్థ పాఠశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు జడ్చర్లపై 71 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. జట్టులో కాన్షిక్ 84 బంతుల్లో 6 ఫోర్లతో అర్ధసెంచరీ (51) సాధించాడు. యువన్ ముద్దనూరి 60 బంతుల్లో 4 ఫోర్లు 1 సిక్స్‌తో 43 పరుగులు, మహ్మద్ సోనూ 38, మనోజ్‌యాదవ్ 39 పరుగులు చేశారు. మణిచరణ్, శ్రీసాయి, పవన్, అక్షయ్‌సాయి ఒక్కో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జడ్చర్ల జట్టు 41.5 ఓవర్లలో 169 పరుగులకు కుప్పకూలింది. జట్టులో బి. సంజయ్ 91 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో అర్ధసెంచరీ (73) చేశాడు. కేతన్‌కుమార్‌యాదవ్ 35 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్ బౌలర్లలో అకింత్‌రాయ్ 3, కాన్షిక్ 2 అబినావ్ 2, యువన్ 1 వికెట్ తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. లీగ్ టోర్నీల్లో 15 పాయింట్లు సాధించి మహబూబ్‌నగర్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టును జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో మ్యాచ్‌లు నిర్వహించి ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు మన్నాన్, ఎన్ఆర్ఐ కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా తిరు కల్యాణ మహోత్సవం

» శ్రీపురంలో కనుల పండువగా రథోత్సవం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కందనూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ వైష్ణవ ఆలయమైన శ్రీపురం శ్రీరంగనాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీభూనీల సమేత శ్రీరంగనాథస్వామి తిరు కల్యాణం మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం స్వామి వారి ఎదుర్కోళ్లు, పల్లకిసేవ అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో రంగనాథస్వామి కల్యాణం కనుల పండుగగా జరిగింది. గోవింద నామస్మరణతో శ్రీపురం మారుమోగింది.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు కల్యాణోత్సవం తిలకిచ్చేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహపరిచారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మాడవీధుల్లో రథోత్సవం శోభాయమానంగా జరిగింది. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డితోపాటు కమిటీ సభ్యులు, భక్తులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జెన్‌కో ఉద్యోగులకు కోటి రూపాయల బీమా

» ఉద్యోగులు, కార్మికుల హర్షం



శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

దోమలపెంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లకు కోటి రూపాయల బీమా సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. వారు విధి నిర్వాహణలో ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు, సహజ మరణం అయితే రూ. 30 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నారు. ఈ మేరకు జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు ఎస్‌బీఐతో ఒప్పందం చేసుకోవడంపై శుక్రవారం శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ఉద్యోగులు, ఆర్టిజన్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు అశోక్, నానుచౌహాన్, బలరాం, లక్ష్మయ్య మాట్లాడారు. విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా చితికి పోకుండా ఆదుకునేందుకు జెన్‌కో యాజమాన్యం కల్పించిన బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జెన్‌కో, ఎస్‌బీఐ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

» ఈ నెల 17 చివరి తేదీ

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్టీ విద్యార్థులకు 3వ తరగతిలో 14, 5వ తరగతిలో 8, 8వ తరగతికి 5, మొత్తంగా 27 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారైతే రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించి ఉండరాదని పేర్కొన్నారు.

విద్యార్థులు స్థానిక, కులం, ఆ దాయం, జనన, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లపై గజిటెడ్ ధ్రువీకరణతో పా టు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తును నిర్దేశించిన తేదీలోగా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు, రూం నెంబర్ ఎఫ్ - 27లో అందించి రసీదు తీసుకోవాలని కోరారు.

ఇంటర్వ్యూ

భూసమస్యల పరిష్కారానికే భూభారతి

» ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్



బిజినేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భూసమస్యల పరిష్కారానికై ధరణి వెబ్‌సైట్ స్థానంలో నూతనంగా భూభారతి పోర్టల్ తీసుకొచ్చిందని బిజినేపల్లి మండల ఇన్‌చార్జి తహసీల్దార్ చిక్కుడు రవికుమార్ అన్నారు. గత ప్రభుత్వంలోని ధరణి పోర్టల్‌కు నూతనంగా తీసుకొచ్చిన భూభారతికి మధ్య ఉన్న తేడాలు రైతులకు అందే సేవలు వంటి వివరాలను ఆంధ్రజ్యోతికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

● భూభారతితో రికార్డుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవచ్చా?

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి ద్వారా రైతులు తమ భూవివరాలు రికార్డుల్లో తప్పుగా నమోదు అయినట్లు గుర్తిస్తే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి ఆర్డీవో లాగిన్‌కు, అక్కడి నుంచి కలెక్టర్ లాగిన్‌కు పార్వర్డ్ చేసి సమస్య ఎవరి పరిధిలో పరిష్కారం జరిగితే అక్కడ చేసే అవకాశం ఉంది.

భూమి వివరాలు ఆన్‌లైన్‌లో కనబడడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి పరిస్థితి ఏమిటి?

ధరణి పోర్టల్‌లో టెక్నికల్ ప్రాబ్లమ్స్ కారణంగా కొందరి రైతుల భూమి వివరాలు అక్కడక్కడ కనబడకపోవడం వాస్తవం. చాలా మంది రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో మోక పంచనామా చేసి సంబంధిత రైతుకు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించే అవకాశం లేకపోవడం ద్వారా చేయలేకపోయాం. ప్రస్తుతం సమస్య తీవ్రతను బట్టి ఏస్థాయి అధికారి లాగిన్‌లో పరిష్కరించాలో గైడ్‌లైన్స్ ప్రకారం చేపట్టే అవకాశం ఉంది.

కోర్టు కేసులు, ఇతర వివాదాల్లో భూముల లావాదేవీలను రికార్డుల్లో మార్పులు చేసే అవకాశం ఉందా?

కోర్టు కేసుల్లో ఉన్న భూములను బదలాయించే హక్కు మాకు లేదు. కోర్టు కేసులో ఉన్న భూమికి ఇన్‌జెక్షన్ ఆర్డర్ తీసుకొస్తే ఎలాంటి క్రయ విక్రయాలు చేపట్టకుండా సంబంధిత సర్వే నెంబర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడుతాం. అలాగే కోర్టు తీర్పు కాపీతో దరఖాస్తు చేస్తే మోక పంచనామా చేపట్టి కోర్టు ఆదేశాల మేరకు క్రయ విక్రయాలకు బ్లాక్ లిస్ట్‌లో ఉన్న సర్వే నెంబర్లను ఓపెన్ చేస్తాం.

సంక్షిప్తంగా..

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పంపిణీ

అచ్చంపేటటౌన్, మే 6, (ఆంధ్రజ్యోతి) అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను ఆయన పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, రామనాదం, నాయకుడు గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే

వంగూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్పర గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు మల్లేష్ ఇటీవలనే అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా రూ. 70 వేల ఆర్థిక సహాయాన్ని మల్లేష్ కుటుంబానికి అందజేశారు. మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య యాదవ్, హరీష్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వంగూరు ఎస్‌ఐగా మహేష్

వంగూరు, జూన్ 6; (ఆంధ్రజ్యోతి) మండల నూతన ఎస్‌ఐగా మహేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న మహేందర్ నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గద్వాల జిల్లా ఉండవల్లి నుంచి వంగూరుకు ఎస్‌ఐగా మహేష్ బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల విషయంలో పోలీస్‌లకు ప్రజలు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా మహేష్ పేర్కొన్నారు.

కల్లుగీత కార్మికుడు మల్లేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తాడూరు మండలం శిరసవాడ గ్రామంలో తాటి చెట్టు ఎక్కి ప్రమాదశాత్తు మృతి చెందిన కల్లుగీత కార్మికుడు మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మల్లేష్ కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని కోరారు.

ఎంపీడీవోగా లింగయ్య

అమ్రాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా లింగయ్య నియమితులయ్యారు. శుక్రవారం అమ్రాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు. అచ్చంపేట మండల పంచాయతీ అధికారిగా పని చేసిన లింగయ్యను అమ్రాబాద్ ఎంపీడీవో గా ప్రభుత్వం నియమించింది. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన జగదీశ్వర్ సెలవుపై వెళ్లడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన లింగయ్యను కార్యాలయ సిబ్బందితో పాటు మండల ఏపీవో రఘు ఆధ్వర్యంలో ఉపాధి హామీ అధికారులు సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

» డీఈవో రమేష్‌కుమార్

కల్వకుర్తి/వెల్దండ/చారకొండ/అచ్చంపేట/పెద్దకొత్తపల్లి/తిమ్మాజిపేట/ఉప్పునుంతల/, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నాగర్‌కర్నూల్ డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభమైందని, బడి బయటి పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం కల్వకుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి డీఈవో రమేష్‌కుమార్ హాజరై ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, ఏకరూప దుస్తులు అందజేయాలని కోరారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ బరపటి వెంకటయ్య, టెస్ట్ బుక్ మేనేజర్ మనపాడు నరసింహులు, ఎంఈవో శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి ఏ. రమేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం వెల్దండ మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో రమేష్‌కుమార్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ వెంకటయ్య, టెస్ట్‌బుక్ మేనేజర్ నర్సింహులు, ఎంఈవో చంద్రుడు, ఎంపీడీవో లక్ష్మన్ నాయక్ ఉన్నారు.

● చారకొండ, జూపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఝాన్సీరాణి, జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట నిర్వహించి గ్రామసభ నిర్వహించారు. ఏపీఎం రాములు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, డాక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మారం భూపాల్ రెడ్డి ట్రస్టు ద్వారా విద్యార్థులకు కావలసిన టై, బెల్టులు, స్టడీ మెటీరియల్స్‌ను ట్రస్టు చైర్మన్ మారం సురేష్ రెడ్డి అందిస్తున్నారని ఉప్పునుంతల మండలం పెనిమిల్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవరావు శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానో పాధ్యాయుడు నర్సింహ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లిలో శివాలయం నాగశేషి ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు , ప్రభుత్వబడులను బలోపేతం చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

● తిమ్మాజిపేటలో ఉపాధ్యాయులతో కలిసి మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శెట్టి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో లక్ష్మీదేవి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

● ఉప్పునుంతల మండల కేంద్రంలో బడిఈడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసురెడ్డి గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం బిచ్చానాయక్, వెంకటష్, తదితరులు ఉన్నారు.

● అమ్రాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ఆయా పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని అమ్రాబాద్ మండల విద్యాధికారి బాలకిషన్ అన్నారు. జీహెచ్‌ఎంలు హనుమంత్‌రెడ్డి, లక్ష్మణరావు, ఏపీఎం నిరంజన్, సీపీఎస్ ప్రధానోపాధ్యాయులు విజయ మోహన్, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసింహ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు కురుమయ్య ఉన్నారు.

● దోమలపెంట బడిబాటలో భాగంగా శుక్రవారం గ్రామంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, పోలీస్ శాఖ అధికారులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాడు అంజిలాల్, ఈగలపెంట ఏఎస్‌ఐ బాలునాయక్, ఉపాధ్యాయురాళ్లు శ్రీలత, కుమారి, శ్రీవాణి, అంగన్‌వాడీ వర్కర్ పాల్గొన్నారు.

● తెలకపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో బడిబాట నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ ఎంపీవో వెంకటయ్య మాట్లాడారు. మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీహెచ్‌ఎస్ తెలకపల్లి ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఏపీవో చంద్రయ్య, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రామస్వామి, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్య, తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం

» ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

» బడిబాట పోస్టర్ ఆవిష్కరణ



బడిబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల బలోపేతమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి బడిబాట పోస్టర్‌ను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని, వాటిలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులంతా సమిష్టిగా పని చేయాలన్నారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తూడికుర్తిలో శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ స్కూల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. నాగర్‌కర్నూల్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర ప్రధానోపాధ్యాయురాలు జి.లత, ఉపాధ్యాయులు అరుణ, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి, త్యాగానికి ప్రతీక బక్రీద్

» బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : శాంతి సౌభ్రాతృత్వం త్యాగానికి ప్రతీక బక్రీద్ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని కలెక్టర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ప్రవక్త ఇబ్రహీం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ చేసిన త్యాగాన్ని గుర్తు చేస్తుందన్నారు. అల్లాహ్ ఆజ్ఞను పాటించడానికి ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి తండ్రి ఇబ్రహీం సిద్ధపడ్డారని, అల్లాహ్ వారి త్యాగాన్ని చూసి ఇస్మాయిల్ స్థానంలో గొర్రెను బలి ఇచ్చి నాటి వారి త్యాగానికి ప్రతిరూపంగానే నేడు బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలన

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పట్టణంలో గల ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎం భద్రతల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఆర్ఎస్ వెంకటయ్య, బీఎస్పీ రామకృష్ణ, వైఎస్ఆర్‌సీపీ హుస్సేన్, టీడీపీ బాలకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

క్రీడలతో శారీరక సామర్థ్యం మెరుగు

» మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి

ఊర్కొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక సామర్థ్యం మెరుగుపడుతుందని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారకార్థం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో పాల్గొని విజయం సాధించిన జట్లకు శుక్రవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల స్మారకార్థం క్రీడలు నిర్వహించడం శుభ పరిణామమని, క్రీడల పట్ల యువత ఆసక్తి పెంపొందించుకోవాలని అన్నారు. అంతకుముందు జకినాలపల్లి గ్రామానికి చెందిన బోయ జంగయ్య ఇటీవలే విద్యుదాఘాతంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మాజీ సర్పంచులు మట్టకృష్ణగౌడ్, మ్యాకల శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ గోపాల్‌గుప్త, నాయకులు బక్కజంగయ్య, గిరినాయక్, శేఖర్‌యాదవ్, రాజశేఖర్, కొండగిరి, అక్బర్, శివ, సిద్దూ తదితరులు ఉన్నారు.



ఊర్కొండపేటలో క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

ఆక్రమణలో చెరువులు, కుంటలు

» తహసీల్దార్‌కు మత్స్యకారుల ఫిర్యాదు



ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మత్స్యకారులు

పెద్దకొత్తపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతుండడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మత్స్య పారిశ్రామిక సహకారసంఘం అధ్యక్షుడు పెబ్బేటి రామస్వామి, కార్యదర్శి జి.మల్లేష్‌ల ఆధ్వర్యంలో మత్స్యకారులు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. పెద్దకొత్తపల్లి గ్రామ పరిసరాల్లో ఉన్నచెరువులు, కుంటలు కొందరు ఆక్రమణదారులు పూడుస్తూ ప్లాట్లుగా, మరికొందరు నీటి వనరులను పూడ్చి సాగుకు అనువుగా మార్చుకుని సాగు చేసుకుంటున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ సమీపంలో ఉన్న వడ్లవానికుంటకు అనుసరించి ఉన్న వ్యక్తులు చెరువును పూడ్చి మట్టిని బయటకు తరలిస్తున్నారని వారు ఆరోపించారు. శుక్రవారం తమ సంఘం సభ్యులమంతా కలిసి వడ్లవాని కుంటకు వెళ్లి చూడగా ఆ చెరువు ఆక్రమణకు గురైందని, దీనిపై విచారణ చేసి ఆక్రమణదారులపై వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దార్‌కు చేసిన ఫిర్యాదులో కోరారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య, ఏ.సత్యం, బాలింగం, ఎస్‌కే.సలేశ్వరం, జి.శేఖర్, తిరుపతయ్య, శ్రీమల్లేష్ ఉన్నారు.

ఘనంగా తల్లోజు ఆచారి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు

కల్వకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నేత మాజీ జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి జన్మదిన వేడుకలు కల్వకుర్తి పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గాంధీనగర్ మైసమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం సమక్షంలో రోగులకు, వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు భారీ కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాలన రసింహ

తెలకపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.కేశవులు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం మండలంలోని గౌరెడ్డిపల్లి సీపీఐ గ్రామ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఆ గ్రామ సీపీఐ నాయకులు దస్తగిరి అధ్యక్షత వహించగా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, మండల కార్యదర్శి వేణిపల్లి రవీందర్ పాల్గొన్నారు. కాగర్ పేరుతో మావోయిస్టులను పూర్తి హతమార్చే కుట్రకు కేంద్ర ప్రభుత్వం కోరుకుంటున్నదని, తక్షణం కాగర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే సీపీఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామసభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శిగా ఎం. నరేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా పి.ఎల్లయ్య, కోశాధికారిగా కొండమ్మతో పాటు 9మందితో గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జూన్ 10న జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

పేదలకు అండగా సీపీఐ

కందనూలు, (ఆంధ్రజ్యోతి) : వంద సంవత్సరాలుగా పేదలకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాలనరసింహ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో డి.సీతారాముల అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, వార్ల వెంకట య్య, జిల్లా సమితి సభ్యులు టి.కృష్ణాజీ, కొమ్ము భరత్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, నాగర్‌కర్నూల్ మండల కార్యదర్శి మర్యాద వెంకటయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, మండల నాయకులు గౌరమ్మ, ఖాజా, గోపిచారి, కొత్త రామస్వామి, శేఖర్, హుస్సేన్, బుచ్చన్న, బీర్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

» కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్



కొల్లాపూర్‌లో కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కొల్లాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు కొల్లాపూర్ పట్టణంలో ఈనెల 9, 10వ తేదీలలో నిర్వహిస్తున్నటు జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలో శిక్షణ తరగతుల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ శిక్షణ తరగతులకు దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ శిక్షణ తరగతులలో దళితులపై జరుగుతున్న దాడులు, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు దళిత చట్టాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. మతోన్మాద చర్యలతో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, అంటరానితనం, కుల వివక్షత అలాగే కొనసాగుతున్నదన్నారు. దీనిపై భవిష్యత్ పోరాటాలకు ఈ శిక్షణ తరగతులలో రూపకల్పన చేస్తామని తెలిపారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను ప్రభుత్వ అధికారులు అమలు చేయడంలో విఫలం అయ్యారని ఆయన విమర్శించారు. మండల కార్యదర్శి బత్తిని రాజు , ఉపాధ్యక్షులు సంజీవ్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ యూరియా వాడండి



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ టి.ప్రభాకర్‌రెడ్డి

తిమ్మాజిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు తక్కువ యూరియా వాడాలని సాగు ఖర్చును తగ్గించాలని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ టి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లిలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వేసే పత్తి, మొక్కజొన్న, వరి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను యూరియా అధికంగా వాడడం ద్వారా కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగునీటిని ఆదా చేయడం పంట మార్పిడి విధిగా పాటించాలన్నారు. రైతు అవసరం మేరకు పురుగు మందులు వాడాలని సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ మిరప పంటలు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు దుక్కి నుంచి నేలను శుద్ధి చేయాలని, మీరు కావాల్సినంతగా వాడుకోవాలని అన్నారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ రైతులు పంటలు వేసుకోవాలని అధిక దిగుబడులను పొందాలన్నారు. శాస్త్రవేత్తలు శైలు, మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రాందేవ్‌రెడ్డి, ఏఈవో శివకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలి

» వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు



విద్యార్థినికి ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న దేవాలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు

కల్వకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే మరింత రాణిస్తారని కల్వకుర్తి వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు అన్నా రు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాల యంలో శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మంచి ప్రతిభ కనబర్చిన పది మంది చొప్పున విద్యార్థులకు పురస్కారాలు పంపిణీ కా ర్యక్రమం జరిగింది.

ముఖ్య అతిథిగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు హాజరై ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం, యువజన విభాగాలు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి సేవా కార్యకమాలు చేపట్టాలని సూచించారు. మహాసభ పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్ మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందు, మౌనిక, యువజన విభాగం అధ్యక్షుడు సంబు తరుణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కొండూరు కృష్ణయ్య, గార్లపాటి శ్రీనివాసులు, అదనపు ప్రధానకార్యదర్శి దొంతు శ్రీనివాసులు, మండలం, పట్టణం కోశాధికారి ఆకుతోట రవి, జూలూరి వీరేష్, మహిళా ప్రధాన కార్యదర్శి రాణి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి గుండల రేవంత్, నితిన్, సంఘం నాయకులు గుండ కృష్ణయ్య, జూలూరి ప్రకాశ్, శోభన్‌బాబు, మహిళా సంఘం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

చారకొండ/కల్వకుర్తి/తిమ్మాజిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ సమస్యల కోసం మండలంలో ఈ నెల 3 నుంచి చేపట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయి. మండలంలోని సిరసనగండ్లలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి రైతులకు భూసమస్యలు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. నాయబ్ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, మజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, కళ్ల సురేందర్‌రెడ్డి, నారాయణ్ సందీప్‌రెడ్డి, గ్యార సురేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

● భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం కోరారు. కల్వకుర్తి మండల పరిధిలోని ముకురాల, బెక్కెర గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇబ్రహీం మాట్లాడుతూ భూభారతి 2025 చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ముకురాలలో 33, బెక్కెరలో 13 భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

● భూభారతితో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తహసీల్దార్ రామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని పుల్లగిరిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి పలు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, గిర్దావర్లు రవిచంద్ర, హారిక, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది రామచంద్రయ్య, భాగ్యమ్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.